ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
గురువారం 20 ఫిబ్రవరి 2025





ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరం

- అభ్యర్థులకు మద్దతుగా పార్టీల ముఖ్యనేతలు
- ఉమ్మడి జిల్లాలో ఎక్కువ ఓటర్లున్న మంచిర్యాలపై నాయకుల ఫోకస్
- జిల్లాకు పెరుగుతున్న నేతల తాకిడి

మంచిర్యాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల గడువు సమీపిస్తున్న కొద్దీ ప్రచారం వేగం పుంజుకుంది. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రచారం ఊపందుకుంది. ఇటీవల ఇక్కడికి వచ్చే వివిధ ప్రాంతాల నేతల సంఖ్య కూడా పెరుగుతోంది. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా మంచిర్యాలలోనే ఎక్కువ మంది ఓటర్లు ఉండగా ముఖ్య నేతలు ఇక్కడే దృష్టి పెడుతున్నారు. దీంతో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గతంలో కంటే పోటీ ఎక్కువగా ఉన్నందున ప్రతీ ఓటు కీలకంగా మారింది. పైగా ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి కూడా అభ్యర్థులు బరిలో నిలవటంతో కింది స్థాయి నాయకుల్లో ఉత్సాహం నెలకొంది. స్థానికుడైన తమ నేతను గెలిపించుకోవాలన్న కుతూహలం వారిలో నెలకొంది.

● మంచిర్యాలలోనే ఓటర్లు అధికం...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పేర్లు నమోదు చేసుకున్న పట్టభద్రులు 67,738 మంది ఉండగా, వారిలో 30,448 మంది మంచిర్యాల జిల్లాకు చెందిన వారే కావడం గమనార్హం. నిర్మల్ జిల్లాలో 16,855 మంది, ఆదిలాబాద్ జిల్లాలో 14,586 మంది, కుమురం భీం జిల్లాలో 5,855 మంది ఓటర్లు ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం ఉమ్మడి జిల్లాలో మొత్తం 5,512 మంది ఓటర్లు ఉండగా, వారిలో నిర్మల్ జిల్లాలో 1,944, ఆదిలాబాద్ జిల్లాలో 1,561, మంచిర్యాల జిల్లాలో 1,550, కుమురంభీం జిల్లాలో 457 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ క్రమంలో పట్టభద్రుల ఓట్లు అధికంగా ఉన్న మంచిర్యాల జిల్లాపై పార్టీలు, అభ్యర్థులు దృష్టి సారిస్తుండగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లను సైతం ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు.

నేతల తాకిడి..

కాగా ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ముఖ్య నేతల తాడికి జిల్లాకు క్రమంగా పెరుగుతోంది. ఇండిపెండెంట్ అభ్యర్థులు నేరుగా వివిధ నియోజకవర్గాల పరిధిలో పర్యటిస్తూ సొంతంగా తమ కేడర్‌తో ప్రచారం నిర్వహిస్తుండగా, బీజేపీ అభ్యర్థుల తరుపున ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆయన వివిధ జిల్లాలకు చెందిన బీజేపీ ఎమ్మెల్యేలు, మంత్రులను ప్రచారంలో పాల్గొనేలా చేస్తున్నారు. పార్టీ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులైన చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్యకు మద్దతుగా ఈ నెల 18న జిల్లా కేంద్రంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తోపాటు కామారెడ్డి, సిర్పూర్ ఎమ్మెల్యేలు వెంకటరెడ్డి, పాల్వాయి హరీష్ బాబులు రోడ్‌షో, సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు.

మిగతా 7లో

బోర్‌వెల్ పనులు ప్రారంభం



బోర్‌వెల్ పనులను ప్రారంభించి మాట్లాడుతున్న జీఎం దేవేందర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాసిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్ర జ్యోతి) : పునాదుల్లోనే పునరావాసం అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో మంద మర్రి ఏరియా జీఎం దేవేందర్ స్పందించారు. బుధవారం దుబ్బగూడెం పునరావాస కాలనీలో బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పునరావాస కాలనీలో విద్యుత్, నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కేకే ఓసీపీ ముంపు గ్రామం దుబ్బగూడెం నిర్వాసితులకు ఇండ్ల స్థలాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రాము, జయప్రకాష్, సూపర్ వైజర్ సుదర్శన్, గుత్తేదారు మాదాసు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం లేక... అభివృద్ధికి దూరంగా..

- సమీపిస్తున్న మహాశివరాత్రి జాతర
- వేలాలలో భక్తులకు తప్పని ఇబ్బందులు

7

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



వంట గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జన్నారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించారు. నిత్యావసర సరుకులను, రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం తరగతి గదుల్లో పాఠ్యాంశాలను బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్ వెంట ఎంఈవో విజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె నర్సింగ్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని హిమ్మత్‌నగర్‌లో బుధవారం నస్పూర్ పట్టణ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ కులాలను వర్గీకరించవద్దని తమ సంఘాన్ని వేదికగా చేసుకొని పోరాడాలన్నారు. నిరుద్యోగులకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం శ్రీరాంపూర్‌కు చెందిన చెవుల వాసును నస్పూర్ పట్టణాధ్యక్షుడిగా, పుట్ట రవిని పట్టణ ఉపాధ్యక్షుడిగా, పర్లపెల్లి సారయ్యను ప్రధాన కార్యదర్శిగా, తరాల విజయ్‌ని ప్రచార కార్యదర్శిగా, తరాల లక్ష్మీనారాయణను గౌరవ సలహాదారులుగా నియమించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తలారి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రంజిత్ కుమార్, మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్, నాయకులు తరాల శ్రీహరి, చీమల రాజలిగు, సోగల రాములు, సొల్లు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి లోనుకావద్దు: డీఈవో



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

దండేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో రాయాలని, భయం వీడితేనే విజయం తథ్యమని జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య అన్నారు. బుధవారం దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేకతరగతులను, మధ్యాహ్న భోజన పథకం అమలు, మెనూ ప్రకారం అందిస్తున్న భోజనాన్ని ఆయన పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించి, వారి ప్రతిభపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదువుకుంటేనే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఎంఈవో దుర్గం చిన్నయ్య, హెచ్‌ఎం నరేందుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు ఉన్నారు.

విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కాసిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పరీక్షలంటే భయం వీడి ఒత్తిడిని జయించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని, విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలి డీఐఈవో అంజయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మార్చి 5 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలను విద్యార్థులు శ్రద్ధగా రాసి వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందుకోసం ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలన్నారు. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్ భవన సముదాయంలో ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు రాజర్షిషా, కుమార్ దీపక్, అభిలాష అభినవ్, అదనపుకలెక్టర్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా సమీకృత గురుకుల పాఠశాలలను రెండు సంవత్సరాల్లో నిర్మించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాలు అనువుగా ఉన్నాయా లేదా పరిశీలించాలని తెలిపారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎంపీ వంశీకృష్ణ

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో పత్తి కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని కోరుతూ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందించారు. ఆన్‌లైన్ సర్వర్ డౌన్‌తో కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆధార్ కార్డు మాన్యువల్‌తో కొనుగోళ్లు చేపట్టాలన్నారు. అలాగే పత్తి కొనుగోళ్లు చేపట్టాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్, సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మొదలైన రోడ్డు పనులు

నస్పూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వెంకటేశ్వర ఆలయం నుంచి రాయల్ ఫంక్షన్ హాల్ చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణ పనులు బుధవారం అధికారులు మొదలు పెట్టారు. ఈ నెల 6న ఆంధ్రజ్యోతిలో " రోడ్డు నిర్మాణంలో జాప్యం.." ఇబ్బందులు పడుతున్న ప్రజలు.. పట్టించుకోని అధికారులు.." శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డు నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించారు. తొందరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వివిధశాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమయపాలన పాటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేయాలని ఎవరైనా భూముల కబ్జాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

దివ్యాంగులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

దివ్యాంగుల కోసం నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ సూచించారు. బుధవారం పట్టణంలోని సింగరేణి కళావేదికలో బెల్లంపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల కోసం ఎంపిక శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. దివ్యాంగుల కోసం శిబిరాలను నిర్వహిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అనంతరం 300 మంది దివ్యాంగులకు అలింకో వారి సహకారంతో పరీక్షలు నిర్వహించారు. ఇందులో అవసరమైన దివ్యాంగులకు ఉపకరణాల కోసం ఫోన్ ద్వారా సమాచారం తెలియజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, ఆర్డీవో హరికృష్ణ, సీడీపీవో స్వరూపరాణి ,సూపర్ వైజర్లు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన

జాతీయ ఆరోగ్య మిషన్ సభ్యులు

జన్నారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఇందన్‌పల్లిలోని ఉప కేంద్రాన్ని జాతీయ ఆరోగ్య మిషన్ పీఆర్‌సీటీ సభ్యులు డాక్టర్ రమణ, డాక్టర్ శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా అందిస్తున్న వైద్యసేవలు, ఆరోగ్య కార్యక్రమాలు, అంటువ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు పెంచాలని, గర్భిణుల నమోదు చేపట్టాలని సూచించారు. క్షయ, కుష్టు నివారణ కార్యక్రమాలు, 108, 102 అంబులెన్స్ సర్వీసుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, ఉప జిల్లా వైద్యాధికారి సుధాకర్‌నాయక్, వైద్యాధికారి ఉమాశ్రీ, డీపీవో ప్రశాంతి, స్టాఫ్‌నర్సులు, ఫార్మాసిస్టులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



జన్నారంలో జాతీయ ఆరోగ్య మిషన్ పీఆర్‌సీటీ సభ్యులతో డీఎంహెచ్‌వో, వైద్యాధికారులు

మాతా శిశు కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం

గర్మిళ్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని బుధవారం పీఆర్‌సీటీ విశాఖపట్నం బృందం సభ్యులు డాక్టర్ రమణ, డాక్టర్ శ్రీనివాస్ సందర్శించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. హెల్ప్ డెస్క్ ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలనిసూచించారు. వారి వెంట డాక్టర్లు భీష్మ, అనిత, పవన్, వేదవ్యాస్, వెంకటేశ్వర్లు, ప్రశాంతి తదతరులు పాల్గొన్నారు.

రైళ్ల రద్దుతో ప్రయాణికుల అవస్థలు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రైల్వేస్టేషన్‌వద్ద నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో కొన్ని రోజులుగా రైల్వే అధికారులు పలు రైళ్లను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల మీదుగా ప్రతీ రోజు ప్రయాణించే సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16 నుంచి 20 వరకు, అలాగే సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్ నగర్‌కు నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి 20 వరకు రద్దు అయ్యింది. అలాగే కోర్బా ఎక్స్‌ప్రెస్, రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు సికింద్రాబాద్ టూ దానాపూర్ నడిచే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 20 వరకు రద్దయ్యాయి.

ప్రతి రోజు నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రద్దు కావడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులతో పాటు వ్యాపారస్తులు ఎక్కువగా సికింద్రాబాద్ వెళ్లడానికి భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ను ఎక్కుతుంటారు.

దీంతో కాగజ్‌నగర్, బెల్లంపల్లి, రవీంద్రఖని, మంచిర్యాల మీదుగా నిత్యం వేలాది మంది ప్రయాణీకులు ఆయా రైల్వేస్టేషన్‌ల నుంచి కాజీపేట, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్తుంటారు. భాగ్యనగర్ రైలు రద్దు అయిన విషయం గ్రామాల ప్రజలకు తెలియక పోవడంతో రైల్వేస్టేషన్‌లకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. రైల్ల రద్దీతో ఆర్టీసీ బస్సుల్లో రెట్టింపు చార్జీలతో ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంటుంది. భాగ్యనగర్‌తోపాటు సూపర్ ఫాస్ట్ రైళ్లు రద్దు కావడంతో వివిధ రాష్ట్రాలకు వెళ్లాల్సిన ప్రయాణీ కులు రైల్వేస్టేషన్‌ల వద్ద పడిగాపులు కాస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.



బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో పడిగాపులు కాస్తున్న ప్రయాణీకులు

మీ చెత్త మాకెందుకు...?

- బెల్లంపల్లి మున్సిపల్ చెత్త కాసిపేటలో పడేయడంపై వెల్లువెత్తుతున్న అభ్యంతరాలు
- రోజు రోజుకూ ముదురుతున్న వివాదం

కాసిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపాలిటీలో జమ చేసిన చెత్తను సోమగూడెం 1వ గని సమీపంలో పడేయడంపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. బెల్లంపల్లి మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను పడేయడానికి డంపింగ్‌యార్డు లేకపోవడం అనేక విమర్శలకు తావిస్తోంది. బెల్లంపల్లి నుంచి 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న సోమగూడెం 1వ గని సమీపంలో పడేయడాన్ని నిరసిస్తూ గత సోమవారం స్థానికులు చెత్త వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. దీంతో అధికారులు చేసేదేంలేక చెత్త వాహనాలను బెల్లంపల్లికి తీసుకువెళ్లారు. కానీ అధికారులు చెత్తను ఎక్కడ పడేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. నేడు చెత్త వ్యర్థాల నుంచి బయోగ్యాస్, సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్న నేపథ్యంలో బెల్లంపల్లి మున్సిపల్ అధికారులు చెత్తను దుబారాగా ఎక్కడ పడితే అక్కడ పడేయడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బెల్లంపల్లిలోని చెత్తవ్యర్థాలను కాసిపేట మండలంలోని దుబ్బ గూడెం గ్రామ సమీపంలో పడేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. చెత్త నుంచి వచ్చే దుర్గంధం, చెత్తను కాల్చినప్పుడు వెలువడే పొగ ద్వారా స్థానికులు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. దీనిపై ఇది వరకు ఆందోళనలు చేసి అధికారులకు చెప్పినా ఎవరు ప ట్టించుకోవడం లేదు. చెత్త వ్యర్థాలను ఇక్కడ పడేయకుండా చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావును వివరణ కోరగా బెల్లంపల్లిలో చెత్త వేసేందుకు స్థలం లేకపోవడం వల్లనే కాసిపేట మండలంలోని సోమగూడెంలో పడే స్తున్నామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెత్తను డంప్ చేస్తున్నట్లు తెలిపారు.



సోమగూడెం 1వ గని వద్ద పడేస్తున్న చెత్త

శాంతి భద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

- చంద్రశేఖర్, రెబ్బెన ఎస్సై



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : శాంతి భద్రతల పరిరక్షనకు తీసుకుంటున్న చర్యలు ఎంటి?

ఎస్సై : శాంతి భద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. వారి ద్వారా ఎప్పటికప్పుడు సమాచారా న్ని సేకరిస్తున్నాం. యువత వ్యసనాల బారిన పడకుండా అవగాహన కార్య క్రమాలు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై : రోడ్డు ప్రమాదాలను నివారించడానికి వాహనాదారులకు అవగాహన కల్పిస్తున్నాం. రాంగ్‌రూట్లో అత్యంత వేగంగా వెళ్లడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించాం. అందుకే తరుచూ వాహనాల తనిఖీ చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : వాహనదారులకు ఎలాంటి సూచనలు చేస్తున్నారు?

ఎస్సై : రోడ్డు నిబంధనలు పాటించాలని సూచిస్తున్నాం. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తున్నాం. కారు నడిపే వారు తప్పకుండా బెల్టు పెట్టుకోవాలి. ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉంటుందని చెబుతున్నాం.

- రెబ్బెన, (ఆంధ్రజ్యోతి)

నిర్లక్ష్యపు నీడలో 'ఆర్కగూడ'



అసంపూర్తిగా ఉన్న కాలువ



కూలిపోయిన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

- 20 ఏళ్లుగా పూర్తి కాని ప్రాజెక్టు పనులు
- శిథిలమవుతున్న నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాబాసాగర్ గ్రామ శివారు ప్రాంతంలో రూ. 12 కోట్లను వెచ్చించి దాదాపుగా 4వేలపైచిలుకు ఎకరాల ఆయకట్టు లక్ష్యంతో నిర్మించిన ఆర్కగూడ ప్రాజెక్టుపై పట్టింపు కరువవుతోంది. 20ఏళ్ల క్రితం ప్రారంభించిన పనులు ఇప్పటికీ పూర్తవ్వలేదు. 2005లో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు 2010లో తుది దశకు చేరింది. కాని నేటికి దాదాపుగా 20 ఏళ్లు అవుతున్నా పనులు పూర్తి కాకపోవడం నిర్లక్ష్య తనా నికి అద్దం పడుతుంది. ప్రాజెక్టులో చెరువు పనులు నిర్మాణం పనులు పూర్తైనా కాలువలు పూర్తికాలేదు. కుడి కాలువ పనులు 70శాతం మేర పనులు కాగా, ఎడమకాలువ పనులు మండల కేంద్రానికి సమీపంలో నిలిచిపోయాయి. దీంతో ప్రాజెక్టులో నిండా నీరున్నా రైతులకు ఉపయోగం లేకుండా పోయింది.

రూ. 12 కోట్ల అంచనా వ్యయంతో..

ఆర్కగూడ ప్రాజెక్టును రూ. 12 కోట్ల అంచనా వ్యయంతో 2005లో ప్రారంభించారు. 2010లో ప్రాజెక్టు చెరువు పనులు పూర్తయ్యాయి. అప్పటి నుంచి ఏటా చెరువు పూర్తి స్థాయిలో నిండి మత్తడి పారుతోంది. ప్రాజెక్టు కింద బాబాసాగర్, చీపురుదుబ్బ, డబ్బా గ్రామాల్లోని భూములు ముంపునకు గురయ్యాయి. 247 మంది రైతులకు చెందిన 627 ఎకరాల భూమికి ప్రభుత్వం పరిహారం చెల్లించింది. ఎకరానికి రూ. 80వేల చొప్పున ఆ సమయంలో రైతులకు అందింది. ప్రాజెక్టు పనుల్లో భాగంగా రివిట్‌మెంట్, మత్తడి, 2డయాఫ్రం వాల్స్, ప్రాజెక్టు కట్టలను నిర్మించారు. మత్తడికింద నీళ్లు మళ్లిస్తూ ప్రవహించడానికి వీలుగా రెండు చోట్ల అప్రోచ్‌వాల్స్ నిర్మాణం చేపట్టారు. కాగా పంటకు సాగు నీరు అందించేందుకు 4 కిలోమీటర్లు, ఎడమ కాలువ, 4 కిలోమీటర్ల కుడి కాలువను నిర్మించాల్సి ఉంది. నిబంధనల ప్రకారం 2013లో పనులు పూర్తి చేయాల్సి ఉంది.

● పొంచి ఉన్న ముప్పు..

బాబాసాగర్ గ్రామస్థులు వానాకాలం సీజన్లో భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా నాయికపుగూడ, బారెగూడ వాసులు భయం భయంగానే కాలం వెల్లదీయాల్సిన పరిస్థితి. నాయికపు గూడ వాగు వర్షాకాలం ఉప్పొంగి ప్రవహించడంతో తమ ఇళ్లలోకి నీరు చేరుతుందనన్న భయం గ్రామస్థుల్లో ఉంది. 2008లో అధిక వర్షాల కారణంగా వాగు ఉప్పొంగడంతో సమీప ఇళ్లల్లోకి నీరు చేరింది. చింతలమానేపల్లి మండల కేంద్రంలోని దుబ్బగూడలో ఈ వాగు కారణంగా పలువురి ఇళ్లు కొట్టుకుపోయాయి. ఈ ప్రాజెక్టు మత్తడి కింది భాగం అప్రోచ్ పూర్తిగా ధ్వంసం కావడంతో మత్తడికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇదే జరిగితే ప్రాజెక్టులోని నీరంతా వర్షాకాలంలో రెండు గ్రామాలను ముంచెత్తే ప్రమాదం ఉన్నది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్థుల తిఫిర్యాదు మేరకు సంబంధిత అధికారులు ఇటీవల ప్రాజెక్టును పరిశీలించారు.

● నాసిరకం పనులు..

ప్రాజెక్టు పనులు నాసిరకంగా చేపట్టారని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రాజెక్టు కట్టకు నీరు నిల్వ ఉండే వైపు చేపట్టిన రివిట్‌మెంట్ నిర్మాణంలో సిమెంట్ వినియోగించ లేదు. కేవలం రాళ్లతోనే నిర్మాణం చేపట్టడంతో నీటి ఉధృతికి రాళ్లు కట్టలోకి కుంగిపోయాయి. కట్ట మీది నుంచి వర్షం నీరు కిందకు ప్రవహించడానికి వీలుగా కాలువలను తక్కువగా నిర్మించడంతో నీళ్ల కట్టనుంచి ప్రవహిస్తున్నాయి. దీంతో కట్ట కోతకు గురవుతోంది. కట్టమీది నుంచి నిర్మించిన కాలువలు సైతం శిథిలమ య్యాయి. మత్తడి నుంచి పారుతున్న నీరు పక్కకి ప్రవహించకుండా నిర్మించిన సైడ్‌వాల్, డయాఫ్రం వాల్స్ సైతం కూలిపోయాయి. రెండో డయాఫ్రం వాల్ పూర్తిగా కూలిపోగా మొదటి డయాఫ్రం వాల్ సగం కూలిపోయింది. మత్తడి నుంచి వచ్చే నీటి ఉధృతి తగ్గించడానికి, వాగు ప్రవాహంలో భూమి కోతకు గురికాకుండా నిర్మించిన కాంక్రీట్ అప్రోచ్ సైతం కొద్ది రోజుల క్రితం కూలిపోయి నేలలోకి కుంగిపోయింది.

అధికారులు చర్యలు తీసుకోవాలి..

- కత్తెర్ల భీమేష్, బాబాసాగర్



ఆర్కగూడ ప్రాజెక్టు విషయంలో అధికారులు చర్యలు తీసుకోవలి. ప్రాజెక్టు వద్ద నిర్మించిన నిర్మాణాలు పూర్తిగా కూలిపోయాయి. వరాకాలంలో వరదనీరు ఉధృతం ప్రవహిస్తే సమీపంలోని గ్రామాల్లోని ఇళ్లలోకి చేరుతాయి. నీటి కాలువల నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రయోజనం లేకుండా పోయింది.

గొర్రెలు చోరీ చేసిన నిందితుల అరెస్టు

కన్నెపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు దొంగతనం చేసిన నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కన్నెపల్లి ఎస్‌ఐ గంగారాం తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం, గోటూరు గ్రామానికి చెందిన పొర్ల నరేష్ గత నెల జనవరిలో తన వృత్తిలో భాగంగా గొర్లను మేపడానికి జన్కాపూర్ గ్రామానికి వచ్చాడు. చుట్టు పక్కల చేన్లలో గొర్రెలను మేపుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 17న తన దగ్గర ఉన్న 160 గొర్రెల్లో నుంచి 33 గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈమేరకు బాధితుడు నరేష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఈక్రమంలో కన్నెపల్లి సబ్‌స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఉన్న నలుగురు నిందితులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని విచారించగా గొర్రెలను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. నిందితులు అల్లి ప్రశాంత్, ముసుకుల సంతోష్, అనంతుల అభిలాష్, వనపర్తి సత్తన్నలను అరెస్టు చేసి బెల్లంపల్లి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 26 గొర్రెలను స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశామని వివరించారు.

కెనాల్‌లో పడి సింగరేణి రిటైర్డు కార్మికుడి మృతి

మంథని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోచమ్మవాడ సమీపంలోని ఎస్ఆర్ఎస్‌పీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి సింగరేణి రిటైర్డు కార్మికుడు తిప్పని శంకరయ్య(80) మృతి చెందాడు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ కాలనీకి చెందిన శంకరయ్య ఈనెల 5న స్వగ్రామమైన ఓదెలకు వెళుతున్నట్లు భార్య మల్లమ్మకు చెప్పి బయలుదేరాడు. ఓదెలకు చేరుకోకపోవడం, ఫోన్ పని చేయకపోడంతో ఈనెల 6న శంకరయ్య కొడుకు తిప్పని లక్ష్మణ్ నస్పూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయం కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు 100కు డయల్ చేశారన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి మృతదేహానికి పరిశీలించారన్నారు. శ్రీరాంపూర్‌లో మిస్సింగ్ కేసు నమోదు కాగా శంకరయ్య బంధువులను మంథనికి పిలిపించగా మృతదేహాన్ని పరిశీలించి శంకరయ్యగా గుర్తించారన్నారని ఎస్‌ఐ రమేష్ తెలిపారు. శంకరయ్య మద్యం సేవించి మతిస్థిమితం లేకుండా తిరుగుతాడని, ఈనేపథ్యంలో మండలంలోని ధర్మారం గ్రామంలో బంధువులు ఉండటంతో ఇక్కడి వచ్చి మద్యం సేవించి ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడి కొడుకు లక్ష్మణ్ ఫిర్యాదు చేయగా ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టు



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్తు పదార్థాలు, రేషన్ బియ్యం, అక్రమ పశువుల రవాణా లాంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహించే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలు, ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై ఉక్కు పాదం మోపాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఇటీవల సిర్పూర్(టి) మండలం హుడ్కిలి చెక్ పోస్టు వద్ద 208 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపులో భాగస్వాములైన 12 మంది నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో 2024 నుంచి ఇప్పటి వరకు రేషన్ బియ్యం తరలింపులో 124 కేసుల్లో 1,594 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. 214 మంది రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. అక్రమంగా పశువుల తరలింపులో 2024 నుంచి ఇప్పటి వరకు 63 కేసుల్లో 208 మందిని రిమాండ్‌కు పంపామని చెప్పారు. 917 పశువులను రక్షించినట్లు తెలిపారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవానా చేయడం, గంజాయి మొక్కలు నాటడం, వాటిని సరఫరా చేయడం అక్రమంగా ఇసుక రవాణా చేయడం, పశువులను అక్రమంగా తరలించడం లాంటి చట్ట విరుద్ద చర్యలకు పాల్పడవద్దని అన్నారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన ట్లయితే 100 డయల్ కానీ పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు.

తాగునీటి బావి ఏర్పాటుకు ప్రతిపాదనలు

జైనూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండంలోని లొద్దిగూడలో ఐటీడీఏ ద్వాదా కొత్తగా తాగునీటి బావి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తున్నామని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లొద్దిగూడలో వాగు ఒడ్డున చెలిమె నీటిని తాగుతున్నారని అన్నారు. విషయంల తెలుసుకుని మంగళవారం సాయంత్రం తనతో పాటు ఎంపీవో మోహన్, గ్రామ కార్యదర్శి, లొద్దిగూడను సందర్శించామని చెప్పారు. ఈ సందర్భంగా సోలార్ పని చేయక నీటి సరఫరా ఇంజన్ పని చేయక పోవడాన్ని గుర్తిం చి మరమ్మతులు చేపట్టామని చెప్పారు. త్వరలో లొద్దిగూడ వాసులకు తాగునీటి సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంజిత్, కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

వాంకిడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం ఛత్రపతి వివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక హనుమాన్ మందిర్ నుంచి ఆరే కులస్థులు బాజా భజంత్రిలతో భజనలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి పతాకాన్ని ఎగురవేశా రు. అనంతరం ఆరే సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం విగ్రహాన్ని అవిష్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ జాబిరే పెంటు, మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్, మాజీ సర్పంచు బండె తుకారాం, బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ సమస్యలు పరిష్కరించుకోవాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పరిధిలో పర్యావరణం, అటవీ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సింగరేణి సలహాదారు (పర్యావరణం, అటవీ) మోహన చంద్ర పర్గెన్ అన్నారు. బుధవారం ఆయన బెల్లంపల్లి రీజియన్‌లోని శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలకు చెందిన జీఎంలు, అటవీ, పర్యావరణ అధికారులతో సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఆయన సమావేశమయ్యారు. గనులకు చెందిన సమస్యలు పెండింగ్ ఉండవద్దన్నారు. వాటి పరిష్కారానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలకు చెందిన జీఎంలు ఎం శ్రీనివాస్, దేవేందర్, శ్రీరాంపూర్ ఓసీపీ పీఓ టి. శ్రీనివాస్, బెల్లంపల్లి ఎస్‌ఓ టు జీఎం నరేందర్, ఎస్టేట్స్ కార్పొరేట్ అధికారులు సునీల్, వెంకటాచార్యులు, ఎస్టేట్స్, ఫారెస్ట్, ఎన్విరాన్‌మెంట్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికే 'బాయిబాట'

జైపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో బాయిబాట కార్యక్రమం చేపట్టామని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు శంకర్‌రావు అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే 1ఏ, ఓసీపీలో బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్మికుల సమస్యలను తెలుసుకుని అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ, మధు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జీఎం



జీఎం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో జీఎంగా పనిచేస్తూ శ్రీరాంపూర్ ఏరియాకు జీఎంగా వచ్చిన ఎం శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఇన్‌చార్జి మేనేజర్ టి. శ్రీనివాస్ పూలబొకే అందించి స్వాగతం పలికారు. పలువురు అధికారులు ఆయనను సన్మనించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, ఇందారం ఓసీపీ పీఓ ఏవీ రెడ్డి, ఏజెంట్లు శ్రీధర్ రావు, వెంకటేశ్వర్లు, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఆనంద్ కుమార్, చంద్రలింగం, తదితరులు పాల్గొన్నారు. కాగా శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్‌ను టీబీజీకేఎస్ నాయకులు బుధవారం మర్యాదపూ ర్వకంగా కలిశారు. కార్మికులకు చెందిన పెండింగ్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వేసవి దృష్ట్యా ఉద్యోగులకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు బండి రమేష్, పొగాకు రమేష్, అన్వేష్‌రెడి, పాల్గొన్నారు.

పనివేళల మార్పుపై సీఎండీ ఆరా

» ఇటీవల శ్రీరాంపూర్ పర్యటనలో అభిప్రాయ సేకరణ



ఉద్యోగులతో మాట్లాడుతున్న సీఎండీ బలరాం (ఫైల్)

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాకు సీఎండీ బలరాం ఈ నెల 12న వచ్చిన సందర్భంగా ఉద్యోగులను పనివేళల మార్పు చేస్తే ఎలా ఉంటుందనే విషయంపై ఆరా తీశారు. అయితే యూనియన్ నాయకులు మాత్రం అలా మార్పులు చేస్తే ఉద్యోగులతో పాటు ఉద్యోగుల కుటుంబ సభ్యులు కూడ్లా ఇబ్బందులు పడతారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్బంగా పనివేళలు మారిస్తే ఎలా ఉండబోతుందని కార్మికులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. పర్యటనలో అభిప్రాయ సేకరణ

- ప్రస్తుతం ఇలా..

ప్రస్తుతం అమలవుతున్న విధానంలో మూడు షిఫ్ట్‌ల్లో ఉద్యోగులు విధులు నిర్వరిస్తు న్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటలకు రెండో షిఫ్ట్, రాత్రి 11 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మూడో షిఫ్ట్ నడుస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఉద్యోగులకు విధులు కేటాయిస్తున్నారు. మొదటి షిఫ్ట్ కార్మికులకు మధ్యాహ్నం, రెండో షిఫ్ట్ కార్మికులకు రాత్రి వేళలో గంట పాటు భోజన సమయం కేటాయించాల్సి వస్తోంది. కార్మికులు తమ భోజనాన్ని ఇంటి వద్ద ముగించుకుంటే సంస్థకు ఒక గంట అదనంగా లభిస్తుందని, ఇది ఉత్పత్తికి ఎంతో దోహదపడుతుందని ఇటీవల నిర్వహించిన మల్టిడిపార్ట్‌మెంట్, రక్షణ కమిటీ సమావేశాల్లో సైతం ఆయా కమిటీలు యాజమాన్యానికి ఈ సూచన చేసినట్లు తెలిసింది.

● ప్రతిపాదిత సమయం ఇలా..

షిఫ్టులు భోజన విరామ సమయానికి ముందుగా లేదా తరువాత ఉండేలా చూడాలని యాజమాన్యం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేకువజామున 5 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మొదటి షిఫ్ట్ ఉండబోతుంది. ఆ తరువాత కార్మికులు ఇంటికి వెళ్లి భోజనం చేస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 9 గంటల వరకు రెండవ షిఫ్ట్ కొనసాగుతుంది. ఈ షిఫ్ట్‌లో పనిచేసేవారు మధ్యాహ్న భోజనం ఇంటి వద్ద చేసి విధులకు వస్తారు. డ్యూటీ ముగిసిన అనంతరం తిరిగి ఇంటికి వెళ్లి భోజనం ముగిస్తారు. రాత్రి 9 గంటల నుంచి వేకువజాము 5 గంటల వరకు మూడవ షిఫ్ట్ కొనసాగుతుంది. ఈ డ్యూటీకి వచ్చే వారు భోజనం ఇంటి వద్ద ముగించుకొని వస్తారు. పలు ప్రైవేటు కంపెనీల మాదిరిగా షిఫ్టులు మార్చడం వల్ల ఒక గంట వృథా కాకుండా పూర్తిగా వినియోగించుకోవచ్చునని సింగరేణి యాజమాన్యం భావిస్తోంది. అయితే ఇవి ప్రతిపాదిత వేళలు మాత్రమే కాగా, అమలు విషయంలో మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోలేదు.

పని వేళల మార్పు వద్దు..



షిఫ్ట్ పని వేళల మార్పు వద్దు. 2004-05 మధ్య కాలంలో కొత్త ఉపరితల గనులు(ఓసీపీలు) వచ్చిన సమయంలో వేకువజా మున 5 గంటల నుంచి డ్యూటీలు ఉండేవి. ఏఐటీయూసీ గుర్తింపు యూని యన్‌గా ఉన్న 2010లో మార్పించాం. మళ్లీ అవే ముందుకు తీసుకురావడం సరికాదు

- బాజీసైదా, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి

సొంతింటి కలను నెరవేర్చాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సొంతింటి కలను నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోరారు. గోదావరిఖని గెస్ట్‌హౌస్‌కు వచ్చిన డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణను కలిసి వినతి పత్రం అం దజేశారు.. కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంగళ శ్రీనివాస్, సదానందం, రాజమౌళి, నరహరిరావు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్టోర్స్ ఇష్యూడ్ మజ్దూర్ పదోన్నతులు కల్పించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి.అనిల్ రెడ్డి బుధవారం ఒక ప్రటనలో కోరారు. డివిజన్‌లోని బొగ్గు గనుల వద్ద ఉన్న స్టోర్లలో మూడేళ్లుగా 50 మంది జనరల్ మజ్దూర్ కార్మికులు పనిచే స్తున్నారని తెలిపారు. . యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఐక్య పోరాట ఫలితమే కనీస వేతనాలు అమలు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ డివిజన్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణివ్యాప్తంగా పనిచేస్తున్న నర్సరీలలో కాంట్రాక్టు కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం నిర్ణయించడం కార్మికుల ఐక్య పోరాట ఫలితమేనని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డివిజన్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి నర్సరీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఈ నెల ఒకటో తేదీ నుంచి జీఓ ప్రకారం వేతనాలు, 8.33 బోనస్ అమలు, సీఎంపీఎఫ్ సౌకర్యం, వైద్య వసతి, బ్యాంకు వేతనాలు ఇచ్చేందుకు సర్క్యులర్ జారీ చేశారని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల కోసం తాము ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నట్లు చెప్పారు. 2022లో 18 రోజుల పాటు జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టామని, అనంతరం చట్టబద్ధమైన ఒప్పందం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సమస్యలు పరిష్కరించుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. సర్క్యులర్ విడుదలకు కృషి చేసిన యూనియన్ నాయకులతో పాటు సింగరేణి డైరెక్టర్లు, ఫారెస్ట్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సహాయ కార్యదర్శి పూసాల సురేంద్రాచారి, కార్మికులు కొట్టె లక్ష్మీ, అనిత, చిన్నక్క, కలవేన లక్ష్మీ, బుచ్చవ్వ, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన ఒకరిపై కేసు

దహెగాం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాల యంలో విధులు నిర్వహిస్తున్న పడాల రాజ్‌కుమార్‌గౌడ్‌పై దాడి చేసిన చప్పిడి విలాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు బుధవారం తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 18న ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘం సభ్యులకు సమావేశం నిర్వహిస్తుండగా విలాస్ అక్కడికి చేరుకున్నాడని చెప్పారు. మహిళలను దుర్భాషలాడుతూ రాజ్‌కుమార్‌గౌడ్‌ను కొట్టినట్లు ఎస్సై తెలిపారు. చంపుతానని బెదిరించినట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కెరమెరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాలతో అనార్‌పల్లి గ్రామంలో బుధవారం తనిఖీలు చేపట్టి పట్టుకున్నామని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. ఈ మేరకు అనార్‌పల్లి గ్రామంలో బానోత్ విజయ్‌కుమార్‌కు చెందిన వాహనం (ఏపీ01వై 0308) తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న 8 క్వింటాళ్ల పట్టుబడి నట్లు తెలిపారు. ఒకరిపై కేసు నమోదు చేసిన ట్లు సీఐ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేష్, కానిస్టేబుళ్లు రమేశ్, సంజీవ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

జైపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్‌ఐ శ్రీధర్ అన్నారు. బుధవారం కిష్టాపూర్ గోదావరి వద్ద రెండు ట్రాక్టర్లు, వేలాల గోదావరి వద్ద రెండు ఇసుక ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంమేరకు తమ సిబ్బంది వెళ్లి ట్రాక్టర్లను పట్టుకున్నారన్నారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ నిర్వాహకులకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సతీష్ బుధవారం తెలిపారు. పట్టుకన్న ఇసుకతో పాటు ట్రాక్టర్లు వాటి డ్రైవర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని ఎస్సై వివరించారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం

లక్సెట్టిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న పంచాయితీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని బుధవారం పట్టణ కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కారుకూరి ప్రదీప్, ప్రధానకార్యదర్శిగా అక్కల రాజమణి, అసోసియేట్ అధ్యక్షుడిగా గోపతి రాజేష్, కోశాధికారిగా పోలంపల్లి సురేష్, ఉపాధ్యక్షులుగా గోపతి సురేష్, సామాంతుల మాధవి, జాయింట్ సెక్రెటరీగా బోడ రాజశేఖర్, మల్యాల సునీత, పబ్లిసిటీ సెక్రెటరీగా పోతు శృతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా మోటపలుకుల రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా శేర్ల వెనతి, చిట్లెం శ్రీలత, ఇండ్ల లావణ్య ఎన్నికయ్యారు.

క్రికెట్ టోర్నమెంట్ జెర్సీ ఆవిష్కరణ

బెల్లంపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఏల్పుల శంకర్ స్మారకార్థం ఆయన కుమారుడు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్‌తో క్రికెట్ టోర్నమెంట్ జెర్సీలను ఆవిష్కరించారు. అనంతరం జెర్సీలను జన్కాపూర్ గ్రామయువకులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మాదవరపు నర్సింగరావు, టీపీసీసీ సభ్యులు చిలుముల శంకర్, మున్సిపల్‌మాజీ చైర్మన్ శ్వేత, కాంగ్రెస్ నాయకులు రమేష్, శంకర్, ఈసా తదితరులు పాల్గొన్నారు.

దుకాణ సముదాయాల ఏర్పాటుకు వేలం

చెన్నూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని కత్తెరసాల గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయం వద్ద మూడు రోజుల పాటు నిర్వహించే జాతరలో దుకాణ సముదాయాల ఏర్పాటుకు బుధవారం వేలం పాట నిర్వహించారు. కొబ్బరికాయలు అమ్మేందుకు వేలం ద్వారా రూ. 1.16 లక్షలు, బోనలు చెల్లించేందుకు రూ. 1.30 లక్షలు, లడ్డు , పులిహోరకు రూ. 1.61 లక్షలు, నూనె అమ్మకానికి రూ. 3100, కొబ్బరి ముక్కలకు రూ. 18వేలు వచ్చినట్లు ఆలయ ఈవో రవి తెలిపారు. మొత్తం రూ. 4.28 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గత ఏడాది కంటే ఈ సారి వేలం పాట ద్వారా రూ. 1.3 లక్షల ఆదాయం ఎక్కువగా వచ్చిందన్నారు. వేలం పాటలో ఆలయకమిటీ చైర్మన్ మల్లేష్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

పాలకవర్గం లేక.. అభివృద్ధికి దూరంగా..

- తాత్కాలిక కమిటీలతో కాలం వెళ్లదీత
- సమీపిస్తున్న మహాశివరాత్రి జాతర
- వేలాలలో భక్తులకు తప్పని ఇబ్బందులు


వేలాల ఆలయానికి వెళ్లే దారి కమాన్


వేలాల మల్లికార్జున స్వామి

మహాశివ రాత్రి వచ్చిందంటే వేలాల గ్రామంలోని వేలాల గట్టు మల్లన్న స్వామిని దర్శించుకోవడానికి ప్రజలు తండోపతండాలుగా వస్తుంటారు. చారిత్రక నేపథ్యం, ప్రాధాన్యం, ఆదాయం ఉన్న ఈ ఆలయానికి ఏళ్లుగా పూర్తిస్థాయి పాలకవర్గం లేక ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో శివరాత్రి జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జైపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆలయాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు అందించడం, వారి సమస్యల గురించి ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, దేవాదాయ శాఖకు నివేదించడానికి చైర్మన్, సభ్యులతో కూడిన పాలకవర్గం కీలకంగా వ్యవహరిస్తుంది. కానీ వేలాల మల్లన్న ఆలయానికి 2019 నుంచి పాలకవర్గం ఏర్పాటు కావడం లేదు. గట్టు మల్లన్న స్వామికి వంశపారంపర్య ధర్మకర్తలు ఉన్నప్పటికీ కమిటీ సభ్యులను నియమించడంలేదు. గత ఏడాది దేవాదాయశాఖ పాలకవర్గ కమిటీ సభ్యుల కోసం నోటిఫికేషన్ విడుదల చేసి ఆరుగురు సభ్యులను ప్రతిపాదించారు. సదరు దస్త్రం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం నుంచి హైదాబాద్‌లోని కమిషనర్ కార్యాలయానికి చేరినప్పటికీ గ్రామానికి చెందిన కొందరు రాజకీయ పలుకుబడితో ఈ ప్రక్రియ పూర్తి కాలేదు.

● గతేడాది నోటిఫికేషన్ విడుదల చేసినా..

దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం రూ. 25 లక్షలలోపు ఆదాయం ఉన్న దేవాలయాలకు ఆ శాఖ కమిషనర్, రూ. 25 లక్షల నుంచి కోటి రూపాయాల ఆదాయం ఉన్న వాటికి ధార్మిక పరిషత్, కోటి రూపాయలకు పైగా ఆదాయం ఉన్న దేవాలయాలకు ప్రభుత్వం పాలకవర్గాన్ని నియమిస్తుంది. గట్టు మల్లన్న ఆదాయం ధార్మిక పరిషత్ పరిధిలోకి వస్తుంది. పాలకవర్గం లేకపోవడంతో జాతర సమయంలో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేస్తూ ఏళ్లుగా నెట్టుకొస్తున్నారు. ఈ కమిటీ జాతర సమయంలో పనిచేయడం లేదు. ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి అధికారం లేకపోవడంపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● ఆదాయం ఉన్నా...

గత ఏడాది మహాశివరాత్రిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు జరిగిన జాతరలో గట్టు మల్లన్నకు రూ. 18,45,799, వేలాల మల్లన్నకు రూ. 35,28,056 ఆదాయం వచ్చింది. ఏటా వచ్చిన ఆదాయంలో గట్టు మల్లన్న నుంచి 46.5 శాతం, వేలాల మల్లన్న ఆలయం నుంచి రూ. 41.5 శాతం దేవాదాయ శాఖకు వెళ్తుంది. ఇంత ఆదాయం ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం ఆశించిన స్థాయిలో లేదని భక్తులు పెదవి విరుస్తున్నారు.

● సమస్యలు ఇవీ..

వేలాల మల్లన్న ఆలయ విస్తరణతో పాటు సాధారణ రోజుల్లో వచ్చే భక్తులకు సరిపడ గదుల నిర్మాణం, పార్కింగ్ సదుపాయం కల్పించాలి. గోదావరిలో నీటి ఎద్దడి ఉన్న సమయంలో బోర్లు ఏర్పాటు చేసి భక్తుల తాగునీటికి, స్నానాలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. గుట్టపైన జాతర సమయంలో కాకుండా మిగితా రోజుల్లో నీటి సౌకర్యం కల్పించాలి.

పాలకవర్గం ఉంటే నిధులు ఎక్కువగా వచ్చేవి



బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధులు నామమాత్రంగా విడుదల అయ్యాయి. ఆలయ పాలకవర్గం ఉంటే వారు ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చి ఎక్కువగా నిధులు తీసుకురావడానికి ఆస్కారం ఉండేది. ఉన్న నిధులతో వేలాల జాతర ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

- రమేష్, వేలాల దేవాదాయ శాఖ అధికారి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరం

(5వ పేజీ తరువాయి)

అలాగే కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డికి మద్దతుగా రెండు రోజుల క్రితం బెల్లంపల్లిలో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లు ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27న జరుగనుండగా, జిల్లాకు నేతల తాకిడి మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి.

ప్రలోభాలకు తెర....

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు కొందరు అభ్యర్థులు ప్రలోభాలకు తెరలేపినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పట్టభద్రుల ఓటర్లను ఆకర్షించేందుకు నజరానాలు ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం. పట్టభద్రుల ఓట్ల కోసం అధికంగా ప్రైవేటు విద్యా సంస్థలపై ఆధారపడుతున్న అభ్యర్థులు వాటి యజమాన్యాల ద్వారా తమ పని చక్కబెట్టుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులను తమకే ఓట్లు వేయించేలా యజమాన్యాలతో చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది. రానున్న రోజుల్లో ఓటుకు ఇంత లెక్క చొప్పున చెల్లించేందుకు సైతం రంగం సిద్ధమైనట్లు సమాచారం.

కవ్వాల్ టైగర్ జోన్‌లో ఐదు మండలాల వాహనాలకే అనుమతులు

జన్నారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐదు మండలాలు జన్నారం, దండేపల్లి, కడెం, దస్తూరాబాద్, ఉట్నూరు మండలాల వాహనాలకు మాత్రమే కవ్వాల టైగర్ రిజర్వు కోర్ ఏరియాలో రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటలకు అనుమతులు ఇస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. జన్నారం మండలానికి చెందిన 9821, దండేపల్లి మండలానికి చెందిన 10278, కడెం మండలానికి చెందిన 192, దస్తూరాబాద్ మండలానికి చెందిన 47, ఉట్నూరుకు చెందిన 1270 మొత్తం 21608 వాహనాలను గుర్తించినట్లు ఎఫ్ఆర్‌వో సుష్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాలకు మాత్రమే అనుమతులు ఇవ్వన్నుట్లు తెలిపారు.

క్రీడాకారులకు షీ టీం సేవలపై అవగాహన

నస్పూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నాగార్జున కాలనీలోని ప్రాణహిత స్టేడియంలో కబడ్డీ క్రీడాకారులకు బుధవారం షీ టీం సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల భద్రత, మహిళా చట్టాలు, షీ టీమ్స్, అమ్మాయిలపై వేధింపులు, ఆన్‌లైన్ మోసాలపై కబడ్డీ క్రీడాకారులకు మంచిర్యాల షీ టీమ్ మహిళా కానిస్టేబుల్స్ జ్యోతి, శ్రీలతలు క్రీడాకారులకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు మహిళల రక్షణ కోసం బస్టాండ్‌ల వద్ద, చౌరస్తాలు, కాలేజీలు, జన సమీకరణ ప్రాంతాల్లో షీటీమ్ నిఘాలో నిరంతరం ఉంటుందని సూచించారు. ఏవరైనా వేధింపులకు గురిచేస్తే 100 నంబరుకు డయల్ చేయాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైమ్ నంబరు 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సతీష్, కోచ్ రవీందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్ అన్నారు. బుధవారం పట్టణంలోని తిలక్ స్టేడియంలో వాకర్స్‌ను కలిసి టీచర్ ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షురాలు కళ్యాణి, నాయకులు శ్రీనివాస్, మహేష్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో సత్తాచాటుతున్న చెన్నూరు యువకుడు


చల్ల శశివంత్‌రెడ్డి

చెన్నూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సింగరేణి ఉద్యోగి చల్ల శశి వంత్‌రెడ్డి తనదైన ప్రతిభతో క్రికెట్‌లో జాతీయ స్థాయిలో తన సత్తా చాటుతున్నాడు. పబ్లిక్ సెక్టార్‌లో వివిధ కేటగిరీల్లో జరిగిన పోటీల్లో శశివంత్‌రెడ్డి సత్తా చాటాడు. ఇటీవల కోల్ ఇండియా లెవెల్‌లో నాగ్‌పూర్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో తన ప్రతిభను కనబర్చాడు. ఈ నెల 26వ తేదీన డెహ్రాడూన్‌లో జరిగే కోల్ ఇండియా పబ్లిక్‌సెక్టార్ పోటీలకు శశివంత్‌రెడ్డి ఎంపికయ్యాడు. వృత్తిరీత్యా ఆయన గోదావరిఖనిలో సింగరేణి ఉద్యోగం చేస్తున్నాడు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


మెడల్‌తో సుప్రియు

కోటపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కోటపల్లి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని సుప్రియ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల హెచ్‌ఎం అశోక్ తెలిపారు. ఈ పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో రాష్ట్రస్థాయిలో రెండో స్థానాన్ని సుప్రియ కైవసం చేసుకుందన్నారు. విద్యార్థినిని హెచ్‌ఎం అశోక్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీకాంత్, ఉపాధ్యాయులు లావణ్య, మధునయ్య తదితరులు అభినందించారు.

అనారోగ్యంతో సీనియర్ అసిస్టెంట్ మృతి

జైపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పరమేశ్వరి (40) మంగళవారం రాత్రి మృతిచెందింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందిందని తెలిపారు. అంత్యక్రియలను బెల్లంపల్లి మండలం లింగధరిగూడంలో బుధవారం నిర్వహించారు. అంత్యక్రియల్లో అదనపు కలెక్టర్ మోతిలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లగురిజాల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దాదాపు 80 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. తాళ్లగురిజాల గ్రామానికి చెందిన పెళ్లి సంపత్‌కుమార్ అనే రైతు తనకున్న భూమితో పాటు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. దిగుబడి వచ్చిన పత్తిని తన ఇంట్లో గదిలో నిల్వ చేసుకున్నాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగి పత్తికి అంటుకున్నాయి. స్థానికులు గమనించి ఫైరింజన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫైరింజన్ చేరుకుని మంటలను ఆర్పివేశారు. రూ. 6 లక్షలకు పైగా నష్టం జరిగిందని రైతు తెలిపాడు.

మా భూములు మాకే కావాలి


కూల్చివేసిన గుడిసె వద్దనే వంట చేసుకుంటున్న గిరిజనులు

జన్నారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మా భూములు మాకే కావాలని, అటవీ అధికారులు నిరాశ్రయులను చేసినా ఇక్కడ నుంచి కదిలేది లేదని అటవీ బాధిత గిరిజనులు పేర్కొన్నారు. మండలంలోని దేవునిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని గడ్డంగూడలో అటవీ ప్రాంతంలో 308 కంపార్టుమెంట్‌లో మంగళవారం తెల్లవారుజామున అటవీ శాఖ అధికారులు గుడిసెలను కూల్చివేశారు. బుధవారం సుమారు 15 కుటుంబాల బాధితులు కూల్చివేసిన గుడిసెల వద్ద గుడారాలను ఏర్పాటు చేసుకుని ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, అటవీ భూమిలో కంది, పత్తి సాగు చేసుకుని జీవనం వెళ్లదీస్తున్నామని, అటవీ శాఖ అధికారులు దాడి చేసి తొలగించడం సరికాదని పేర్కొన్నారు.

● గిరిజన నాయకుల పరామర్శ

గడ్డం గూడలో అటవీ శాఖ అధికారులు గుడిసెలను తొలగించడంతో నిరాశ్రయులైన కుటుంబాలను మండల గిరిజన నాయకులు బుధవారం పరామర్శించారు. వారికి న్యాయం జరగాలని అటవీ శాఖ అధికారులు ఆర్వోఎఫ్ఆర్ ప్రకారం పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అటవీ భూములను నమ్ముకొని జీవనం : రాథోడ్ లత



ఇక్కడ అటవీ భూమిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నాం. పత్తి, కంది వంటి పంటలను సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు నిర్ధాక్షిణ్యంగా గుడిసెలను తొలగించి వెళ్లిపొమ్మంటే ఎక్కడకు వెళ్లాలి. మాకు న్యాయం జరిగే వరకు ఇక్కడ నుంచి కదలం.

ప్రభుత్వం ఆదుకోవాలి : రాథోడ్ రమేష్



గడ్డంగూడలో 308 కంపార్టుమెంట్‌లో సాగు చేసుకుని ఉంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలి. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలి. గుడిసెలను కూల్చివేయడంతో ఏమి లేకుండా రోడ్డున పడి నిరాశ్రయులమయ్యాం.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

భీమారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) లారీ, కారు ఎదురురెదురుగా ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలికి తీవ్రగాయాలైన ఘటన భీమారం మండల కేంద్రంలో బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తగూడం వద్ద మంచిర్యాల వైపు నుంచి కంకర లోడుతో వస్తున్న లారీ, చెన్నూరు వైపు నుంచి వస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న వృద్ధురాలికి గాయాలయ్యాయి. వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. కారు సైతంధ్వంసం అయింది. విచారణ చేసి లారీ డ్రైవర్ రాకేష్‌పై కేసు నమోదు చేశారు. లారీ, కారును పోలీసుస్టేషన్‌కు తరలించామని ఎస్సై శ్వేత తెలిపారు.

సింగరేణి కార్మికులు గైర్హాజరు కావద్దు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు విధులకు గైర్హాజరై డిస్మిస్ పేరిట ఉద్యోగాలు కోల్పోవద్దని కేకే 5 గని రక్షణాధికారి రమేష్ , పీఏ బుచ్చయ్యలు పేర్కొన్నారు. బుధవారం గని ఆవరణలోని క్యాంటీన్‌లో గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సింగరేణిలో మంచి వేతనాలు ఉన్నాయని, గైర్హాజరైతే వేతనాలు కోల్పోతారన్నారు. విధుల్లో సమస్యలుంటే అధికారులకు తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి రవళి తదితరులు పాల్గొన్నారు.

'ఆందోళనకు గురవుతున్న కార్మికులు'

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీపీ మూత పడుతుండడంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ అక్బర్ ఆలీ పేర్కొన్నారు. బుధవారం ఆర్కే ఓసీపీలో పిట్‌సెక్రటరీ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓసీపీ మూత పడుతుండడంతో వేరే చోటకు బదిలీ అవుతామనే ఆలోచనతో కార్మికులు ఆందోళనలకు గురవుతున్నారన్నారు. యాజమాన్యం స్పందించి దీనిపై స్పష్టత ఇవ్వాలన్నారు. నాయకులు లింగయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి


లక్షెట్టిపేట, దండేపల్లి, చెన్నూర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, యువకులు

జిల్లాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు మండలాల్లో శోభాయాత్ర నిర్వహించారు.

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని లక్ష్మీటాకీసు చౌరస్తాలో జరిగిన వేడుకల్లో బీజేపీ నాయకులు రఘునాద్ వెరబెల్లి, రవీందర్, హరికృష్ణ, మున్నారాజా, పురుషోత్తం, కిరణ్, వెంకటేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, చిరంజీవి, మురళీ తదితరులు పాల్గొన్నారు. హాజీపూర్ మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ సేవా సమితి నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జరిగిన వేడుకల్లో ఛత్రపతి శివాజి ఉత్సవ కమిటి కార్యనిర్వహణ ప్రముఖ్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గర్మిళ్ల (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని బాయ్స్ హైస్కూల్ మైదానంలో ఫిట్‌నెస్ సెంటర్, కొమురంభీం సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఫిట్‌నెస్ సెంటర్ అధ్యక్షుడు దార కుమారస్వామి, తుల ఆంజనేయులు, శ్రీనాథ్, చంద్రకాంత్, లక్ష్మణ్, అశోక్, ప్రభాకర్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జన్నారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, నాయకులు లక్ష్మీనారాయణ, నరసగౌడ్, రాజన్న, మహేష్, శంకర్, పురుషోత్తం,రఘు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరిగిన వేడుకల్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ ఆరీఫ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొప్పు సుమన్, నాయకులు పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు దండేపల్లి నుంచి లక్షెట్టిపేట పాతబస్టాండ్ మీదుగా కరీంనగర్ చౌరస్తా వరకు సుమారు 200బైకులతో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మంచిర్యాల జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాత్ వెరబెల్లి, లక్షెట్టిపేట పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్‌రావు,నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి (ఆంధ్రజ్యోతి): పట్టణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ శోభాయాత్ర నిర్వహించారు. వన్‌టౌన్ ఎస్ హెచ్‌వో దేవయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మందమర్రిటౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్‌లో జరిగిన వేడుకల్లో హిందూ సైన్యం, హిందూ బంధువు నాయకులు పాల్గొన్నారు.

తాండూర్ (ఆంధ్రజ్యోతి): శివాజీ ఉత్సవ సమితి నాయకులు తాండూర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి ర్యాలీ నిర్వహించి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నస్పూర్ (ఆంధ్రజ్యోతి): నస్పూర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపం నుంచి ప్రారంభమై తెలంగాణ తల్లి చౌరస్తా, సీసీసీ కార్నర్ మీదుగా రాయల్ ఫంక్షన్ హాల్ నుంచి వేంకటేశ్వర ఆలయం వరకు శోభాయాత్ర జరిగింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, హిందూ సంఘాల నేతలు పాల్గొన్నారు.

చెన్నూరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.



ఘనంగా బోనాలు

చెన్నూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కత్తెరసాల గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం ఘనంగా బోనాలు నిర్వహించారు. స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అల్లు బండ వద్ద భక్తులు అల్లు పట్టారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు.



లోపాలను సవరించాలి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన లోపాలను సవరించి ఉపకులాలకు న్యాయంచేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగతో కలిసి పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్ నేత బుధవారం హైద్రాబాద్‌లో కమిషన్ చైర్మన్ షమీమ్‌అక్తర్‌కు వినతిపత్రం అందించారు.



ఎంఈవో బాధ్యతల స్వీకరణ

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఎంఈవోగా దత్తుమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయం సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది గుండ మధుకుమార్, దుర్గం శ్యాం, శంకర్, సరిత, సీఆర్‌పీలు రాంచందర్, సుభాషిణి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.



క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కాంపల్లి శంకర్, ప్రగతి యువజన సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీధర్ అన్నారు. బుధవారం పట్టణంలో నెహ్రూ యువజన కేంద్రం వారి సహకారంతో క్లస్టర్ లెవల్ క్రీడలను నిర్వహించారు.



చట్టాలపై అవగాహన


సిర్పూర్(యు), ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాగాం బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు చట్టాలపై స్వచ్ఛంద సంస్థ జీవన ఆధార్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ సాక్రు బాయి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల తలెత్తే ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రుణాలు మంజూరు చేయాలి

సిర్పూర్(యు), ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజనులకు స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయాలని వీటీడీఏ మండల చైర్మన్ కుమ్ర భీం రావు కోరారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో బుధవారం జనరల్ మేనేజర్ పద్మభూషన్‌కు కలిసి వినతి పత్రం అందించారు. సిర్పూర్(యు) మారుముల మండలం కావడంతో అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. గిరిజనులు స్వయం ఉపాధి పొందేలా రుణాలు అందజేయాలన్నారు. ఈ విషయంపై అవగాహన కల్పించాని కోరారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అకాడమి ఫర్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని డీసీపీవో మహేష్ అన్నారు. బుధవారం విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, క్రమ శిక్షణ, ఆర్గనైజేషన్, బిహేవియర్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత కష్ట పడి అంకిత భావంతో శిక్షణను పూర్తి చేసుకుని ప్రభుత్వం కల్పించేటువంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అభ్యర్థుల ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ పత్రాలను టాస్క్ మేనేజర్ సాయి కుమార్‌తో కలిసి డీసీపీవో అందజేశారు.



స్థానిక సమరం
మరింత ఆలస్యం

స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరిగే సూచనలు కనిపించడం లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మరో సారి కులగణన నిర్వహిస్తున్న కారణంగా ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే అవకాశం లేకుండా పోయింది.

బీసీ రిజర్వేషన్ల అంశం తేలాకే నిర్వహించాలని సర్కార్ యోచన

మే లేదా జూన్‌లో ఉండొచ్చనే సంకేతాలు

ఆశావహుల్లో నిరాశ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యం అయ్యే అవకాశం ఉండడంతో ఆశావహులు మరికొంత కాలం ఎదురు చూడక తప్పని పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణ తరగతులు తదితర పనులు పూర్తి చేశారు. కాగా ఇటీవల మరోసారి కులగణన చేపట్టడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు చట్ట బద్ధత కల్పించడంపై ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు మరికొంత కాలం వాయిదా పడుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏడాదికిపైగా ప్రత్యేకాధికారుల పాలన

స్థానిక సంస్థలో ప్రత్యేకాధికారుల పాలన ఏడాదికి పైగా కొనసాగుతోంది. గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ముగిసి ఏడాది దాటింది. జిల్లాలో 123 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా వారి పదవీ కాలం గత యేడాది జూలై 3వ తేదీతో ముగిసింది. జిల్లాలో 15 మంది జడ్పీటీసీ సభ్యులు ఉండగా వారి పదవీ కాలం కూడా ఒక్క రోజు తేడాతో అంటే జూలై 4వ తేదీతో ముగిసింది. ప్రజా ప్రతినిధుల పదవీ కాలం పూర్తవడంతో గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ బాధ్యతలను ప్రతేకాధికారులకు అప్పగించారు.

ఇటీవల ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడంతో జిల్లాలోని 335 పంచాయతీల్లో ఆశావాహులు బరిలో నిలిచేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల స్థానాలకు సైతం ఎన్నికలను నిర్వహిస్తామనే సంకేతం జిల్లాలోని 15 మండలాలలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేసింది.

రిజర్వేషన్లపై ఉత్కంఠ..

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా స్థానాల్లో రిజర్వేషన్లు ఎలా మారుతాయన్న దానిపై ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకొంది. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు మే లేదా జూన్ మాసాల్లో ఎన్నికలు జరగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతు న్నాయి. ఈనెల చివరిలోగా బీసీ కుల గణన రీ సర్వే పూర్తి చేసి దానిని అసెంబ్లీలో అమోదించడానికి పంపనున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు చట్టబద్ధత కల్పించి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికలకు ఇంకా మూడు నుంచి నాలుగు నెలల సమయం ఉండడంతో రిజర్వేషన్లు తమకు అనుకూలిస్తాయో లేదో అని ఆశావహుల్లో ఆందోళన నెలకొంది.

పెరిగిన పరిషత్ స్థానాలు..

జిల్లాలో కొత్తగా నాలుగు ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. గతంలో జిల్లాలో 123 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సారి మార్చిన నిబంధ నలతో కొత్తగా నాలుగు స్థానాలు పెరిగాయి. ప్రస్తుతం జిల్లాలో 127 స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. స్థానిక ఎన్నికల కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఆయా పార్టీల నాయకులు బరిలో నిలిచేందుకు మండల, నియోజకవర్గ, జిల్లా నేతలను కలుస్తూ తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఏ రిజర్వేషన్ అయితే ఎవరు పోటీ చేయాలనే విషయమై గ్రామాల్లో ఇప్పటికే నేతలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికే నిర్వహించిన కులగణనలో చాలా మంది పాల్గొన లేదని నిర్ధారణకు వచ్చింది. దీంతో వారికి మళ్లీ కులగణన నిర్వహిస్తామని తాజాగా ప్రకటించింది. ఈనెల 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కులగణన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఆన్‌లైన్ సర్వేతో పాటు టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజాపాలన అధికారులు వద్ద కూడా నమోదు చేసుకునే విధంగా అవకాశం కల్పించారు.



నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

వాంకిడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండకాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్య రాకుండా గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని, సూచించారు. సమావేశంలో ఎంపీవో ఖాజా అజీజుద్దీన్, ఏపీవో శ్రావణ్, ఈసీ మోసిన్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీల్లో వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి తలెత్తకుండా నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో సత్యానారాయణ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీవో చంద్రయ్య, ఏవో తిరుపతి, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు నిధులు లేక ఇబ్బందులు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవ డంతో ఇబ్బందులు పడుతున్నామని, నిర్వహణ తమతో కాదని పంచాయతీ కార్యదర్శులు బుదవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిర్వహణ కోసం నిధులను విడుదల చేయాలని అన్నారు. బకాయిలు చెల్లించక పోతే మార్చి ఒక టి నుంచి పంచాయతీల నిర్వహణ చేయలేమని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు శంకర్, ఇస్తారి, ఆసిఫ్, తదితరులు ఉన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ నిర్వహణ తమతో కాదని పంచాయతీ కార్యదర్శులు బుదవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఆల్బర్ట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాకేష్, చంద్రశేఖర్, నరేష్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

సిర్పూర్(యు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తహసీల్దార్ ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణ, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి స్వప్న, ఎస్సై ధర్మరావు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బస్సులో మరిచిపోయిన సర్టిఫికెట్లను బాధితుడికి ఆర్టీసీ డీఎం విశ్వనాథ్ బుధవారం అందజేశారు. తిర్యాణికి చెందిన ప్రయాణికుడు దేవిదాస్ ఆసిఫాబాద్ నుంచి తాండూరుకు ప్రయాణం చేశాడు. అతడి భార్యకు సంబంధించిన సర్టిఫికెట్లు మరిచి పోయి బస్సు దిగి వెళ్లి పోయాడు. గమనించిన కండక్టర్ మణెమ్మ డీఎం విశ్వనాథ్‌కు అప్పగించారు. డీఎం అడ్రస్ తెలుసుకుని అందజేశారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్ర జ్యోతి): జిల్లా కేంద్రంలో 22న నిర్వహించే సేవాలాల్ మహరాజ్ జయంతి పోస్టర్లను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శివప్రసాద్ నాయక్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇందులాల్, గోపాల్ నాయక్, వస్రం నాయక్, దుప్పనాయక్ పాల్గొన్నారు.

నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 19: కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, డీసీసీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ హాజరవుతారని తెలిపారు.

రోడ్డు పనులకు భూమి పూజ

కౌటాల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి శివారులోని వార్ధా నది మధ్యలో గల శివ సిద్ధి హనుమాన్ ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దత్తు, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శులు ధన్‌రాజ్, ప్రవీణ్, సభ్యులు దివాకర్, నితేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీమియం లీగ్ పోటీలు ప్రారంభం

కౌటాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల సందర్భంగా కౌటాల ప్రీమియం లీగ్ పోటీలను మాజీ ఎంపీపీ విశ్వనాథ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బాపు, వానుపటేల్, వసంత్‌రావు, తిరుపతి, రవీందర్‌గౌడ్, ప్రకాష్, అశోక్, గోపాల్ పాల్గొన్నారు.

జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ కార్యవర్గాన్ని బుధవారం కరీంనగర్‌లో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బండ రాజ్‌కుమార్ (వరంగల్) ఎన్నిక య్యారు. కార్యవర్గ సభ్యులుగా రాకేష్(ఆసిఫాబాద్), రమేశ్‌రెడ్డి(మంచిర్యాల) ఎన్నికయ్యారు.

జోడే ఘాట్‌ను సందర్శించిన విద్యార్థులు



మ్యూజియం కళాఖండాలను తిలకిస్తున్న విద్యార్థులు

కెరమెరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా గుడిపేట మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాల విద్యార్థులు బుధవారం కెరమెరి మండలంలోని కుమరం భీం పురిటిగడ్డ అయిన జోడేఘాట్ గ్రామాన్ని సందర్శిం చారు. గ్రామంలో భీం విగ్రహం, జల్ జంగల్ జమీన్ ఆర్చీలతో పాటు మ్యూజియంలోని గిరిజనుల కళాఖండాలను తిలకించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

ఘనంగా బీరప్ప పండుగ



ఉత్సవాల్లో పాల్గొన్న కుర్మ కులస్తులు

కౌటాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలోని కన్కి గ్రామంలో బుధవారం బీరప్ప పండగను ఘనంగా నిర్వహించారు. పత్తి కుర్మకుల ఆరాధ్య దైవమైన బీరప్ప పండగను ఘనంగా వైభవంగా నిర్వహించారు. గత గురువారం ప్రారంభమైన పండగ బుధవారం చివరి రోజు నాగెవెల్లి, దేవుణ్ని ఎత్తుకోవడంతో బీరప్ప పండగ ముగిసింది. కుల పెద్ద కుర పోశమల్లు ఈ పండగను అట్టహాసంగా నిర్వహించారు.

క్షయ వ్యాధిపై అవగాహన

వాంకిడి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సవ్వాతి గ్రామంలో బుధవారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఈఓ రవిదాస్ మాట్లాడుతూ క్షయవ్యాధి మైకో బ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని చెప్పారు. రాత్రిళ్లు చెమట పట్టి జ్వరం రావడం లాంటి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ఆశా లేదా ఏఎన్ఎంకు చెప్పాలని ప్రభుత్వ ఆసుపత్రికి రావాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గోదావరి, భగవన్‌దాస్, ప్రధానోపాధ్యాయుడు శ్యాంరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ నమూనా గృహం పరిశీలన

సిర్పూర్(టి), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనా గృహాన్ని బుధవారం హౌసింగ్ డిప్యూటీ ఈఈ రాజ్‌గోపాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేయాలని ఏఈ సజియోద్దీన్‌ను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు ఉండాలని చెప్పారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనా గృహాన్ని బుధవారం గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఈఈ వేణుగోపాల్ పరిశీలించారు. రూ.5 లక్షలతో నిర్మాణాలు చేపడు తున్నామని చెప్పారు. ఆయన వెంట గృహ నిర్మాణశాఖాధికారి సజియోద్దీన్ తదితరులు ఉన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



బెజ్జూరులో జెండా ఆవిష్కరిస్తున్న ఆరె సంఘం నాయకులు

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని ఆరె సంక్షేమ సంఘం నాయకులు ఆయన చిత్రపటాలు, విగ్రహాల వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జెండా ఎగురవేశారు.



ఆసిఫాబాద్‌లో శివాజీ విగ్రహానికి పూల మాల వేస్తున్న ఆరె సంఘం నాయకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం పిలుపునిచ్చారు. బుధవారం శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ భవనంలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి జెండాను ఆవిష్కరించారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): శివాజీ మహారాజ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ పోరాటం అభినందనీయమని కొనియాడారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆరె సంక్షేమ సంఘం, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎస్‌బీఐ చౌక్, జేతావన్ బుద్ధ విహార్ వద్ద ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మెన్ జాబిరే పెంటయ్య, ఆరే సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పూల్లజీ బాబా ధ్యాన కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అరెకుల సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో నానయ్య, వెంకయ్య, మల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరె కుల సంఘం నాయకులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, యువకులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో శివాజీ మహారాజ్ జయంతిని అరెకుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సత్తన్న, వెంకన్న, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిగాం గ్రామంలో నూతన విగ్రహాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆవిష్కరించారు. అలాగే మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో ఆరె సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): దహెగాం మండల వ్యాప్తంగా బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఆరె సంఘం ఆధ్వర్యంలో నిర్వహంచారు. కార్యక్రమంలో బక్కయ్య, మల్లేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని నిర్వహించారు. . ఆరె సంఘం మండలాధ్యక్షుడు వసంత్ జెండాను ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీ విశ్వనాథ్, బీజేపీ నాయకుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శివాజీ మహారాజ్ జయంతిని నిర్వహిం చారు. ఆయా కార్యక్రమాల్లో జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు



వాంకిడిలో శివాజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

నాణ్యత పాటించాలి

బెజ్జూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎల్కపల్లి గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ నాణ్యత లేకుడా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఏఈ మక్బూల్, కార్యదర్శి తుకారాం తదితరులు పాల్గొన్నారు.